ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
07-12-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 90 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



సమాజంలో కొత్త పుంతలు తొక్కుతున్న నేరాలను అరికట్టడంలో సరికొత్త వ్యూహాలతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరాష్ట్ర పోలీసు శాఖకు సూచించారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ మహమ్మారిని నిరోధించడానికి పోలీసు శాఖలో సుశిక్షితులైన వారితో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని, పోలీస్ రైజింగ్ డేను స్మరిస్తూ, ప్రజా సేవ కోసం ఎక్కువ సమయం విధి నిర్వహణలో ఉంటున్న హోంగార్డులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పలు వరాలను ప్రకటించారు.

# కొత్త పుంతలు తొక్కుతున్న నేరాలు

జయభేరి, హైదరాబాద్ :

ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా హోం శాఖ విజయాలపై నెక్లెస్ రోడ్డు హెచ్ఎండీఏ మైదానంలో నిర్వహించిన సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు తో కలిసి పాల్గొన్నారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాలు, డాగ్ స్క్వాడ్‌లు ఇచ్చిన ప్రదర్శనలను తిలకించారు. ఆయా విభాగాలు వినియోగించే ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ట్రాఫిక్ అసిస్టెంట్‌స్‌గా నియమితులైన ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ... గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను నిరోధించడంలో కొంత ప్రగతి సాధించినప్పటికీ ప్రస్తుత చర్యలు సరిపోవు. మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. డ్రగ్స్, సైబర్ క్రైమ్స్ వంటి కేసుల్లో న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు పడే విధంగా స్పెషల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి సుశిక్షితులైన అధికారులను నియమించాలి. ఈ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం. హైదరాబాద్ నగరంలో ప్రధానంగా కాలుష్యం తగ్గించడం, ట్రాఫిక్ ను నియంత్రించాల్సిన అవసరం ఎంతో ఉంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ట్రాన్స్ జెండర్లు అడుక్కునే దృశ్యాలను గమనించి, వారు ఆత్మగౌరవంతో బతకడానికి, జనజీవన స్రవంతిలో

...మిగతాది 2 లో

# తెలుగు రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్

## తెలంగాణలో 7 నవోదయ, ఏపీలో 8 కేంద్రీయ విద్యాలయాలు



2 లో

తెలుగు రాష్ట్రాలకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఆంధ్రప్రదేశ్ కు ఎనిమిది కేంద్రీయ విద్యాలయాలు, తెలంగాణకు ఏడు నవోదయ విద్యాలయాలను కేటాయించింది. ఈ మేరకు కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల ఉభయ తెలుగు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌కు ఎనిమిది కేంద్రీయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. అలాగే తెలంగాణకు ఏడు నవోదయ విద్యాలయాలను కేటాయిస్తూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది.



## రేవంత్ రెడ్డి ఆదేశాలతో పని చేస్తే.. ఇబ్బందిపడేది మీరే

**పోలీసులకు హరీశ్ రావు హెచ్చరిక**
**కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతంగా ఉంటుందని భావించవద్దని సూచన**
**రేవంత్ రెడ్డి పాలన ఇందిరమ్మ ఎమర్జెన్సీని తలపిస్తోందని ఆగ్రహం**
**పోలీసులతో రాజ్యమేలే ప్రభుత్వం మనుగడ సాధించలేదు**

జయభేరి, హైదరాబాద్ :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు పని చేస్తే ఆ తర్వాత ఇబ్బందిపడేది వారేనని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పోలీసులు రాజ్యాంగానికి, చట్టానికి లోబడి పని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతంగా ఉంటుందని భావించవద్దన్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుంచి రాత్రి ఎనిమిది గంటల తర్వాత ఆయనను పోలీసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ. రేవంత్ రెడ్డి పాలన ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి,

...మిగతాది 2 లో

# సీఎం చెప్పినా వినరా..

## కనిపించని ఆన్ లైన్ సేవలు





జయభేరి, అనంతపురం, డిసెంబర్ 6:

ఏపీలో రెవెన్యూ సేవలు సులభతరం కావాలి... ఆన్లైన్ లో అన్ని సర్వీసులు అందుబాటులోకి రావాలి, ధృవ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నా పౌరసేవల్లో మాత్రం మార్పు రావడం లేదు. డిజిటల్ పౌరసేవల్లో దేశానికే ఒకప్పుడు తలమానికంగా వ్యవహరించిన రాష్ట్రంలో ఇప్పుడు ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలవరీ వ్యవస్థ పడకేసింది. గ్రామ వార్డు సచివాలయాలతో పౌరసేవల్ని అందించిన తర్వాత కొండ నాలుక్కి మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టు పరిస్థితి తయారైంది.వాట్సాప్‌లోనే ప్రజలు నేరుగా డిజిటల్ ధృవీకరణలు పొందేలా టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్టు చెబుతున్నా పౌర సేవల్లో నాణ్యత మాత్రం మెరుగు పడటం లేదు. రెవిన్యూ శాఖ ద్వారా అందించే పౌర సేవల్ని ఆన్‌లైన్‌లో నేరుగా ప్రజలు అందుకునే ఏర్పాటు కల్పిస్తున్నట్టు కొద్ది రోజుల క్రితం ప్రకటించారు. పేరుకు ఆన్‌లైన్ సర్వీసులు కంప్యూటర్ తెరపై కనిపిస్తున్నా ప్రజలకు మాత్రం సర్టిఫికెట్లు జారీ కావడం లేదు. పేమెంట్ గేట్‌వే సమస్యలతో నగదు కట్ అవుతున్నా కావాల్సిన సర్టిఫికెట్లు మాత్రం జారీ కావడం లేదు.రెవిన్యూ శాఖలో ఆస్తులకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్లు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, సర్టిఫైడ్ కాపీల వంటి వాటిని రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పొందవచ్చని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. అయితే సర్టిఫికెట్ల జారీలో

...మిగతాది 2 లో

# ఆర్టీజీఎస్‌లో అప్పుడు ఇప్పుడు అదే తంతు..



రియల్ టైమ్ గవర్నెన్స్... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రిక...రాష్ట్ర విభజన తర్వాత ఏపీ సచివాలయం నుంచి రాష్ట్రంలో ఏ మూల ఏమి జరిగినా క్షణాల్లో తెలుసుకునేలా వ్యవస్థల్ని అనుసంధానించిన టెక్నాలజీ. 2019కు ముందు ఈ వ్యవస్థ ముఖ్యమంత్రి చంద్రబాబును మభ్య పెట్టిందనే విమర్శలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యల పరిష్కారం, పాలనా పరమైన సమస్యల్ని పరిష్కరించడంలో టెక్నాలజీని వినియోగించడంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దేశంలో ముందుంటారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారిత పౌరసేవల్ని అందించడంలో మిగిలిన రాష్ట్రాలకు చంద్రబాబు ముందుచూపు ఆదర్శంగా నిలుస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత చంద్రనబాబు ఆలోచనలకు అనుగుణంగా ఏర్పాటైన సాంకేతిక వ్యవస్థల్లో రియల్ టైమ్ గవర్నెన్స్ ఒకటి.

ప్రభుత్వ యంత్రాంగాలు, శాఖలు అన్నింటిని ఒకే తాటిపైకి తీసుకొచ్చి ఏక కాలంలో ఏ శాఖలో ఏ అంశాన్నైనా పరిశీలించేలా ఆర్టీజీఎస్ వ్యవస్థను తీర్చిదిద్దారు. క్లుప్తంగా చెప్పాలంటే విశాఖ సముద్ర తీర ప్రాంతంలో సముద్ర కెరటాలు, అటుపోట్లను కూడా వెలగపూడిలో కూర్చుని పర్యవేక్షించే అవకాశం ఆర్టీజీఎస్‌లో ఉండేది. తీర ప్రాంతాల్లో అలల తీవ్రత అధికంగా ఉన్న సమయంలో సందర్శకులు ప్రమాదానికి గురైతే ఆర్టీజీఎస్ కెమెరాల్లో పరిశీలించి విశాఖ పోలీసుల్ని అప్రమత్తం చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. 2017లో ఆర్టీజీఎస్ ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్కడి నుంచి సమావేశాలు నిర్వహించడానికి మొగ్గు చూపేవారు. ఆర్టీజీఎస్‌కు మరో కోణం కూడా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు టెక్నాలజీ వినియోగంపై ఉన్న మక్కువను కొందరు తప్పుదోవ పట్టించారనే విమర్శలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, పౌర సేవలపై ప్రజల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవడాన్ని పాలనలో భాగం చేశారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో రికార్డు స్థాయిలో సానుకూల ప్రజాభిప్రాయలు వచ్చినట్టు నివేదికలు అందేవి. తుఫానులు, ప్రకృతి విపత్తులు, నష్ట పరిహారం, పంటల నష్టం, రైతు సాయం వంటి ఏ విషయంలోనైనా 80శాతం అనుకూల ఫలితాలు వచ్చేవి. వాటిని ముఖ్యమంత్రి కూడా పరిగణలోకి తీసుకునే వారు. ప్రభుత్వం తలపెట్టిన ఏ కార్యక్రమంపై అయినా ఐవీఆర్ఎస్ , ప్రజాభిప్రాయ సేకరణ, సంతృప్తి స్థాయిలో ప్రజల మద్దతు తతంగం కొనసాగేది.

...మిగతాది 2 లో

# కాంగ్రెస్ కు దూరమవుతున్న మిత్రులు

2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్

శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత కేంద్ర మంత్రి వర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేశంలోని 19 రాష్ట్రాల్లో 85 కొత్త కేంద్రీయ విద్యాలయాలకు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి, వలసపల్లె (చిత్తూరు జిల్లా, మదనపల్లె మండలం), పాలసముంద్రం (శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం), తాళ్లపల్లి (గుంటూరు జిల్లా మాచర్ల మండలం), నందిగామ (కృష్ణా జిల్లా), రొంపిచర్ల (గుంటూరు జిల్లా నరసరావుపేట డివిజన్), నూజివీడ్ (ఏలూరు జిల్లా), ఢోన్ (నంద్యాల)లో కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఏపితో పాటు అరుణాచల్‌ప్రదేశ్ (1), అస్సాం (1), ఛత్తీస్‌గఢ్ (4), గుజరాత్ (3), హిమాచల్‌ప్రదేశ్ (4), జమ్ము కాశ్మీర్ (13), జార్ఖండ్ (2), కర్ణాటక (3), కేరళ (1), మధ్యప్రదేశ్ (11), మహారాష్ట్ర (3), ఢిల్లీ (1), ఒరిస్సా (8), రాజస్థాన్ (9), తమిళనాడు (2), త్రిపుర (2), ఉత్తరప్రదేశ్ (3), ఉత్తరాఖండ్ (4)ల్లో కొత్త కేంద్రీయ విద్యాలయాలను ప్రారంభించనున్నారు. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో కెవి శివమొగ్గలో కేంద్రీయ విద్యాలయాన్ని విస్తరణకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. మొత్తం ఈ 86 కేంద్రీయ విద్యాలయాలకు ఏర్పాటుకు 202526 నుంచి ఎనిమిదేళ్లలో రూ. 5,872.08 కోట్లు ఖర్చు చేయనున్నారు.

**తెలంగాణలో 7 నవోదయాలు**

తెలంగాణలో ఏడు నవోదయాలు ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణలో జగిత్యాల, నిజామాబాద్, కొత్తగూడెం భద్రాద్రి, మేడ్చేల్ మల్కాజ్‌గిరి, మహబుబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యపేటలో నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో 28 కొత్త నవోదయాలను ఏర్పాటు చేయనున్నారు. అరుణాచల్‌ప్రదేశ్(8), అస్సాం (6), మణిపూర్ (3), కర్ణాటక (1), మహారాష్ట్ర (1), పశ్చిమ బెంగాల్ (2) నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేస్తారు. మొత్తం ఈ 28 నవోదయ విద్యాలయాలకు ఏర్పాటుకు 202425 నుంచి 202829 మధ్య రూ. 2,359.82 కోట్లు ఖర్చు చేయనున్నారు.

**ఢిల్లీ మెట్రో నాలుగో విడత ప్రాజెక్టుకు ఆమోదం**

ఢిల్లీ మెట్రో నాలుగో విడత ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రిథాలా నుండి కుండ్లీ వరకు 26.468 కిలో మీటర్ల మేరా ఈ మెట్రో ప్రాజెక్టు నిర్మిస్తారు. దేశ రాజధాని, పొరుగన ఉన్న హర్యానా మధ్య కనెక్టివిటీని మరింత మెరుగుపరుస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రాజెక్టు పూర్తి వ్యయం రూ.6,230 కోట్లతో ఢిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ (డీఎంఆర్సీ) అమలు చేస్తుంది. ఈ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ), ఢిల్లీ ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో భరిస్తారు.

## సీఎం చెప్పినా వినరా..

జనాలకు చుక్కలు కనిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా సర్టిఫికెట్లు పొందకుండా కొందరు అడ్డు పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్ఐసి ద్వారా అందే ప్రభుత్వ సేవల్లో కావాలనే అంతరాయలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈసీలు,సీసీలు, మ్యుటేషన్ వంటి పనులు చేయడానికి కమిషన్ల దందా నడుస్తుంది. ప్రతి పనికి ఫిక్స్డ్ ఛార్జీని వసూలు చేయడం రివాజుగా మారింది. ప్రభుత్వం నేరుగా ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తే ఆదాయానికి గండి పడుతుందనే ఉద్దేశంతో ఆన్‌లైన్ సర్టిఫికెట్లు జారీ కాకుండా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.ఆన్‌లైన్‌లో జారీ చేస్తున్న సర్టిఫికెట్ల చెల్లుబాటు కూడా ప్రశ్నార్థకం అవుతోంది. సచివాలయాలు, మీ సేవల్లో జారీ చేసే సర్టిఫికెట్లను గ్రామ, వార్డు సచివాలయాల పేరుతో ఇస్తున్నారు. ప్రభుత్వ అధికారిక చిహ్నాలతో క్యూఆర్ కోడ్‌తో పాటు వాటికి గుర్తింపు ఉంటుంది. ఆన్‌లైన్‌లో ఎవరికి వారు సొంతంగా దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి ధృవీకరణ ఉండటం లేదు. న్యాయస్థానాలు ఇలాంటి సర్టిఫికెట్లను తిరస్కరిస్తున్నాయి. సివిల్ వివాదాల్లో ఈసీలు, సర్టిఫైడ్ కాపీలపై ఎలాంటి ప్రభుత్వ గుర్తింపు లేకపోవడంతో న్యాయపరమైన చిక్కులు తలెత్తుతున్నాయి.డిజిటల్ పౌర సేవల్ని సంక్లిష్టంగా మార్చేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. గతంలో ఐటీ మంత్రిత్వ శాఖ ద్వారా ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ వ్యవస్థ సమర్థవంతంగా పౌరసేవల్ని అందించేది. మీ సేవల్లో దరఖాస్తు చేస్తే కావాల్సిన సర్టిఫికెట్లను ప్రభుత్వ గుర్తింపుతో జారీ చేసేవారు. సచివాలయాల్లో సర్టిఫికెట్లు వాట్సాప్‌లో జారీ చేసి, సాంకేతిక కారణాలు చెప్పి.. మీ సేవల్లో ప్రింట్ తీసుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. పిడిఎఫ్ సర్టిఫికెట్లు ఎవరు జారీ చేశారో ధృవీకరించే ఏర్పాటు కూడా లేదు. నకిలీ సర్టిఫికెట్లు పుట్టుకొస్తే ఎవరు బాధ్యులనే ప్రశ్న ఎదురవుతోంది.డిజిటల్ పౌర సేవల విషయంలో ప్రధాన కార్యదర్శుల స్థాయి అధికారుల్ని కూడా కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారు. డిజిటల్ సేవల్లో ఎదురవుతున్న సమస్యల విషయంలో మభ్యపెడుతున్నారు.ప్రజలకు ఆన్‌లైన్ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని నివేదికలు ఇస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలకు వాస్తవ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటోంది.

## రేవంత్ రెడ్డి ఆదేశాలతో పని చేస్తే..

కాంగ్రెస్ నేతలు చెబుతున్న మార్పు. నిర్బంధాలు, అక్రమ అరెస్టులు రాజ్యాంగ ఉల్లంఘనలేనని ఎద్దేవా చేశారు. పోలీస్ స్టేషన్లన్నీ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారి పోయాయని విమర్శించారు. ఎఫ్ ఐఆర్‌లు పోలీస్ స్టేషన్లలో కాకుండా గాంధీ భవన్‌లో తయారవుతున్నాయని ఆరోపించారు. ఎవరి మీద ఏ సెక్షన్లు పెట్టాలి, ఎవరిని అరెస్ట్ చేయాలో గాంధీ భవన్ నుంచి ఆదేశాలు వస్తున్నాయన్నారు. ప్రతిపక్షంపై ముఖ్యమంత్రి పగబట్టినట్లుగా ఉందన్నారు. ఇది ప్రజాపాలన కాదు...రాక్షస పాలన అని మండి పడ్డారు. ఏడాది పాలనలో రేవంత్ రెడ్డి ఒక్క మంచి పనైనా చేశారా? అని నిలదీశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదు, కానీ ఏడో గ్యారెంటీగా రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. ఏ నిరుద్యోగ యువతకు మాట ఇచ్చారో అదే నిరుద్యోగుల వీపులను అశోక్ నగర్‌లో పగులగొట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి గిరిజనులపై దాడి చేసి జైళ్లలో నిర్బంధించారన్నారు. రేవంత్ పాలన నాటి ఇందిరమ్మ హయాం నాటి ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. ఇందిరమ్మ లాంటి వాళ్లను కూకటి వేళ్లతో పెకిలించిన దేశం మనది అన్నారు. పోలీసులను అడ్డు పెట్టుకొని గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. పోలీసులతో రాజ్యమేలితే ప్రభుత్వం మనుగడ సాధించలేదని హెచ్చరించారు.

## కొత్త పుంతలు తొక్కుతున్న నేరాలు

చేర్చాలన్న ఉద్దేశంతో ట్రాఫిక్ అసిస్టెంట్స్‌గా విధుల్లోకి తీసుకోవడం జరిగింది. సమాజంలో వారు వివక్షకు గురికావొద్దు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న పోలీసు ఉన్నతోద్యోగులకు పరిహారం చెల్లిస్తున్నట్టుగానే, హోం గార్డులు ఎవరైనా ప్రమాదవ శాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలని నిర్ణయించాం. అలాగే, హోం గార్డులకు రోజుకు 921 రూపాయలు చెల్లిస్తుండగా, ఇకనుంచి 1000 రూపాయలకు పెంపు. వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ.200 కు పెంపు. ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు అందుతున్నట్టుగా హోం గార్డులకు ఆ సౌకర్యాలు లేని కారణంగా వారి కుటుంబాలను రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు చేస్తాం. ఇవన్నీ జనవరి ఒకటి నుంచి అమలు చేస్తాం. పోలీసు పిల్లలు సైతం ఉన్నతమైన విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్లకు తీసిపోకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 50 ఎకరాల్లో పోలీస్ స్కూల్ ప్రారంభిస్తున్నాం. ఎక్కడి నుంచి వచ్చారంటే పోలీస్ స్కూల్ నుంచి వచ్చామని సగర్వంగా చెప్పుకునే స్థాయిలో తీర్చిదిద్దుతాం. సమాజానికి ఎన్నో సేవలు అందిస్తున్న పోలీసు ఉద్యోగం అంటే మీకు ఉపాధి కాదు. ఇదొక భావోద్వేగం. ప్రభుత్వ ప్రతిష్ఠను కాపాడే బాధ్యత మీపైన ఉంది. ఫ్రెండ్లీ పోలీసు అంటే... బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి. బాధితులు, అన్యాయానికి గురైన వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలి. కబ్జాలు, హత్యలు, ఆర్థిక నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించాలి. నేరగాళ్లకు ప్రొటోకాల్ పాటిస్తే మీరు మీ విధులను నిర్వర్తించలేరు. సమాజంలో ఎక్కువ సేవలు అందిస్తున్నది పోలీసులే. అలాగే ఎక్కువ విమర్శలు ఎదుర్కొనేది కూడా పోలీసులే. యూనిఫామ్ ఫోర్స్ అంటే క్రమశిక్షణతో ఉండాలి. మీకేవైనా సమస్యలు ఉంటే వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రజల సమస్యలను పరిష్కరించే మీకు సమస్యలు ఉండొద్దు... అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

# కాంగ్రెస్ కు దూరమవుతున్న మిత్రులు

లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమై ఇండియా కూటమిని ఏర్పాటు చేశాయి. హ్యాట్రిక్ అధికారం చేపట్టకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఇండియా కూటమి ఆపలేకపోయాయి. కానీ, భారత కూటమి ఎన్డీయేకి గట్టి పోటీనిచ్చింది.



**కాంగ్రెస్ తీరుపై అసంతృప్తితో ఉన్న మిత్రపక్షాల సంఖ్య పెరుగుతోంది. ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ ఇప్పటికే ప్రకటించింది. పార్లమెంట్ సమావేశాలు ఇండియా కూటమి లోని విభేదాలను మరోసారి బయటపెట్టాయి. అదానీ అంశంపై పార్లమెంటు లోపలేకాదు, బయటకూడా రచ్చ ఆగడం లేదు. మోదీని విమర్శిస్తూ రాహుల్‌గాంధీ నేతృత్వంలో పార్లమెంటు మకరద్వారం దగ్గర విపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. అయితే ఇండియా కూటమిలో రెండు పార్టీలు మాత్రం ఈ ఆందోళనకు దూరం అయ్యాయి. ఇండియా కూటమి ఆందోళనకు తృణమూల్, సమాజ్‌వాదీ పార్టీలు దూరంగా ఉన్నాయి.ఉత్తర ప్రదేశ్ సంభల్ మతఘర్షణలపై చర్చకు సమాజ్ వాదీ పట్టుబట్టింది. సంభల్ కంటే అదానీ వ్యవహారం పెద్దది కాదన్నారు ఎస్పీ నేతలు. బంగ్లాదేశ్ హింస, నిరుద్యోగం, అధిక ధరలు, మణిపూర్ అల్లర్లు, బెంగాల్ సమస్యలపై చర్చకు తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది.**

లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమై ఇండియా కూటమిని ఏర్పాటు చేశాయి. హ్యాట్రిక్ అధికారం చేపట్టకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఇండియా కూటమి ఆపలేకపోయాయి. కానీ, భారత కూటమి ఎన్డీయేకి గట్టి పోటీనిచ్చింది. ఇక ఫలితాల తర్వాత విపక్షాల ఐక్యత మెల్ల మెల్లగా విచ్ఛిన్నం అవుతూ వస్తోంది. ఢిల్లీహర్యానాలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య రాజకీయ వైరుధ్యం పెరుగుతూ వచ్చింది. ఇటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) మధ్య విభేదాలు స్పష్టంగా కనిపించాయి. ఇండియా కూటమిలో కాంగ్రెస్‌కు మిత్రపక్షాల నుంచి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇండియా కూటమిలో పార్టీల మధ్య ఉన్న విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అండగా నిలుస్తున్న ప్రాంతీయ పార్టీలు తాజాగా తమ స్వంత డిమాండ్లపై దృష్టి సారించడం గమనార్హం. ఇటీవల పార్లమెంట్‌లో కీలకమైన ఆందోళనలు జరుగుతున్నప్పటికీ, ఈ వివిధ పార్టీల మధ్య సమన్వయం లేకపోవడం ప్రతిపక్ష కూటమికి సంక్షోభాన్ని తెలుస్తోంది. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) వంటి పార్టీలు తమ సొంత రాష్ట్ర సమస్యలపై ఆందోళనలు ప్రారంభించాయి.ఎస్పీ ఎంపీలు ఉత్తరప్రదేశ్‌లో రైతులకు న్యాయం చేయాలని పట్టుబట్టగా, టీఎంసీ ఎంపీలు పశ్చిమ బెంగాల్‌కు నిధుల విడుదలపై కేంద్రాన్ని నిలదీశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అదానీ కేసు ఆందోళనకు ఈ పార్టీలు మద్దతు ఇవ్వకపోవడం, బీజేపీని ఎదుర్కొనే ప్రతిపక్ష ఐక్యత మీద అనుమానాలను రేకెత్తిస్తోంది. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసనకు దిగినప్పటికీ, మిగతా కూటమి పార్టీల నిర్లిప్తత ఈ పోరాటానికి ఊపందించలేదు.అదానీ వ్యాపారంపై అమెరికాలో నమోదైన కేసులు, మణిపూర్ అల్లర్లు వంటి అంశాలు కాంగ్రెస్ ప్రధాన డిమాండ్లుగా ఉండగా, ఇతర పార్టీలకు వీటిపై పెద్దగా ఆసక్తి లేకపోవడం కాంగ్రెస్ ఒంటరితనాన్ని పెంచుతోంది. ఇండియా కూటమిలో ఈ విభేదాలు బీజేపీకి మరింత బలం చేకూరుస్తున్నాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీల ఐక్యత లేదని చాటిచెప్పేలా బీజేపీ నాయకత్వం దీన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.గతంలో వ్యవసాయ చట్టాలపై ఉద్యమం, మణిపూర్ అంశం, ఇప్పుడు అదానీ వ్యవహారం విషయాల్లోనూ చివరకు కాంగ్రెస్ ఏకాకి కావడం, బీజేపీ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచడం స్పష్టమవుతోంది. ఇప్పటికే బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ, కూటమి అంతర్గత విభేదాల కారణంగా మరింత ఒంటరితనానికి గురవుతుండటం పార్టీ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారింది. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు ఏకంగా ముందుకెళ్లగలిగితేనే బీజేపీని ఎదుర్కోవడం సాధ్యం అవుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇండియా కూటమిలో ఎవరికి వారే యమునా తీరే లాగా పరిస్థితి తయారయ్యింది. కాంగ్రెస్ తీరుపై అసంతృప్తితో ఉన్న మిత్రపక్షాల సంఖ్య పెరుగుతోంది. ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ ఇప్పటికే ప్రకటించింది. పార్లమెంట్ సమావేశాలు ఇండియా కూటమి లోని విభేదాలను మరోసారి బయటపెట్టాయి. అదానీ అంశంపై పార్లమెంటు లోపలేకాదు, బయటకూడా రచ్చ ఆగడం లేదు. మోదీని విమర్శిస్తూ రాహుల్‌గాంధీ నేతృత్వంలో పార్లమెంటు మకరద్వారం దగ్గర విపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. అయితే ఇండియా కూటమిలో రెండు పార్టీలు మాత్రం ఈ ఆందోళనకు దూరం అయ్యాయి. ఇండియా కూటమి ఆందోళనకు తృణమూల్, సమాజ్‌వాదీ పార్టీలు దూరంగా ఉన్నాయి.ఉత్తర ప్రదేశ్ సంభల్ మతఘర్షణలపై చర్చకు సమాజ్ వాదీ పట్టుబట్టింది. సంభల్ కంటే అదానీ వ్యవహారం పెద్దది కాదన్నారు ఎస్పీ నేతలు. బంగ్లాదేశ్ హింస, నిరుద్యోగం, అధిక ధరలు, మణిపూర్ అల్లర్లు, బెంగాల్ సమస్యలపై చర్చకు తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అంతేకాకుండా ఇండియా కూటమి పగ్గాలు మమతా బెనర్జీకి అప్పగిస్తే బాగుంటుందని అంటున్నారు టీఎంసీ నేతలు. ప్రధాని మోదీని ఢీకొట్టే శక్తి కాంగ్రెస్ నేతలకు లేదన్నారు టీఎంసీ ఎంపీ కీర్తిఆజాద్. బెంగాల్‌లో బీజేపీని దీదీ సిక్సర్ కొట్టారని, ఆరు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటారని అన్నారు. ప్రధాని మోదీ బెంగాల్‌కు వచ్చి మమతను విమర్శించినప్పుడల్లా ఆమె శక్తి రెట్టింపు అవుతోందన్నారు కీర్తి ఆజాద్. ఇక ఢిల్లీ ఎన్నికల విషయంలో ఒంటరిగానే పోటీ చేస్తామని, ఆమ్ ఆద్మీ పార్టీతో ఎలాంటి పొత్తు ఉండదని కాంగ్రెస్ పార్టీ శుక్రవారంనాడు ప్రకటించింది. రాష్ట్రంలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఒంటరిగానే పోటీ చేస్తామని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ తెలిపారు. ఏ పార్టీతోనూ పొత్తులుండవని స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరమే ముఖ్యమంత్రి ఎవరనే దానిపై కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.అదానీ వ్యవహారంలో మరో మిత్రపక్షం ఎన్సీపీ నుంచి కూడా కాంగ్రెస్‌కు మద్దతు లభించడం లేదు. దీంతో ఇండియా కూటమిలో పెద్ద భాగస్వామి పార్టీలు అదానీ వ్యవహారంలో కాంగ్రెస్‌కు దూరమవుతున్నాయి. అయితే ఇండియా కూటమి పగ్గాలు దీదీకి అప్పగించడం పెద్ద జోక్ అని వ్యాఖ్యానించారు కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్. అదానీ వ్యవహారంపై పార్లమెంట్ లోపల , బయట తమ ఆందోళన కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ఆర్టీజీఎస్‌లో అప్పుడు ఇప్పుడు అదే తంతు..

క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు ఈ ప్రజాభిప్రాయాలకు ఏమాత్రం పొంతన ఉండేది కాదు. ఈ పొరపాటు ఎక్కడ జరుగుతుందనేది కూడా గుర్తించలేకపోయారు. మెరుగైన పౌర సేవల కోసం నేరుగా లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఇటీవల నిర్ణయించారు. ఐవిఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలని, ఏ అంశంపైనైనా ప్రజలు చెప్పిందే ఫైనల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో పాటు క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం అమలు చేసే పథకాలపై IVRS పద్ధతిలో ఫోన్లు చేయడం ద్వారా ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకుంటోంది. లబ్ధిదారులకే నేరుగా కంప్యూటర్ బేస్డ్ ఫోన్ కాల్స్ ద్వారా ఆ పథకం వల్ల ప్రయోజనం, దాని అమలు, సేవల్లో నాణ్యత వంటి అంశాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనుంది. లబ్ధిదారుల నుంచి ఆయా పథకాల అమలుపై వారి అభిప్రాయం కోరుతూ IVRS కాల్స్ వెళతాయి. ప్రజలు ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసుకుని పని చేయనుంది. ఇంటింటికీ పింఛన్లు, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల లబ్ధిదారుల నుంచి ఈ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. పింఛను సక్రమంగా ఇంటి వద్దనే అందుతుందా లేదా.....దీపం పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా వంటి ప్రశ్నల ద్వారా లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నారు.

పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయం తెలుసుకోనున్నారు. ఉచిత ఇసుక విధానం అమలు, మద్యం కొత్త పాలసీ, అమ్మకాలపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పథకాలు, కార్యక్రమాలతో పాటు రానున్న రోజుల్లో రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ వంటి పలు కీలక శాఖల్లో ప్రజలు పొందుతున్న పౌరసేవలపై కూడా IVRS ద్వారా ప్రజల నుంచి సమాచారం సేకరించనున్నారు. ప్రజల నుంచి వచ్చే ఈ సమాచారంలో ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే.. వాటికి గల కారణాలు విశ్లేషించి సేవలను మరింత మెరుగు పరచనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే విషయం ప్రాతిపదికన ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఫోన్ కాల్స్ కు ప్రజలు ఒపిగ్గా తమ అభిప్రాయాలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుతున్నారు. ఈ ఫోన్ కాల్స్ కు ప్రజలు వెచ్చించే ఒకటి రెండు నిముషాల సమయంతో ప్రభుత్వ నుంచి ఉత్తమ సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. ఈ క్రమంలో పబ్లిక్ గ్రివెన్స్‌లో ప్రజలు అందించిన ఫిర్యాదులు పరిష్కరించేసినట్టు ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయి. ఫిర్యాదులు పరిష్కరించకపోయినా, యథాతథంగా అలాగే ఉన్న వాటిని కూడా గ్రివెన్స్ రిడ్రెస్డ్ క్యాటగిరీలో చేర్చేస్తున్నారు. ఫిర్యాదుల్ని నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించాలనే నిబంధనలు ఉండటంతో పరిష్కారమైనా లేకపోయినా అర్జీలను ముగిస్తున్నారు. దీంతో ఇదంతా ప్రహసనంగా మారింది.

## మరోసారి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు



✍ జయభేరి, హైదరాబాద్:

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండ సురేఖ మరోసారి ఫైర్ అయ్యారు. మీడియాతో మాట్లాడుతూ. కేటీఆర్ భాష దారుణంగా ఉంది. కేటీఆర్ కంటే, కేసీఆర్ బెటర్‌గా మాట్లాడుతారు. కేటీఆర్ భాష అసహ్యంగా ఉంది అంటూ విమర్శలు గుప్పించారు. విద్యార్థులు పోరాడితే తెలంగాణ వచ్చిందన్నారు. ఉద్యమంలో కేసీఆర్ కుటుంబంలో ఎవరికి ఒక గీత కూడా పడలేదన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి ఆత్మహత్య చేసుకునేలా చేశారని విమర్శించారు. కేటీఆర్‌కు కామన్ సెన్స్ లేదన్నారు.

రేవంత్ పై కేటీఆర్ పిచ్చి కూతలు కూస్తున్నారని, తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం వస్తుందని తెలిశాక కేటీఆర్, కవిత తట్టా బుట్టా సర్దుకొని ఉద్యమంలోకి వచ్చారని వ్యాఖ్యలు చేశారు. రేవంత్ సక్సెస్ వెనక ఎంత శ్రమ ఉందో తెలుసుకోవాలన్నారు. ప్రతి దానికి రేవంత్‌పై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కులాలలపై సూక్ష్మంగా ఆలోచిస్తూ వారి ఎదుగుదల కోసం రేవంత్ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు ఫాం హౌస్‌లో పడుకున్నారని విమర్శించారు. కేటీఆర్ మీడియా ముందు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు కడుపునిండా తిని, కంటి నిండా నిద్రపోయారని బీఆర్ఎస్ నాయకులు భ్రమ పడుతున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని.. అందుకే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ ఉచ్చులో విద్యార్థులు పడొద్దని హితవుపలికారు. గతంలో పెట్రోల్ క్యాన్ తెచ్చుకొని అగ్గిపెట్టె మర్చిపోయారని, ఇప్పుడు పెట్రోల్ క్యాన్ తెచ్చుకుంటే అగ్గిపెట్టెలు బీఆర్ఎస్ కార్యకర్తలే తెచ్చు కుంటారంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు.

అలాగే బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిపై కూడా మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి గంధపు చెక్కల బిజినెస్ మడత పెట్టుకోవాలన్నారు. సహచర మంత్రిని తిట్టినందుకే రెస్పాండ్ కావాల్సి వస్తుందన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేపై మాట్లాడాలంటే తన స్థాయి తగ్గుతుందంటూ వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ప్రజలపై ఎంత ప్రేమ ఉంటుందో అందరికీ తెలుసన్నారు. ఉద్యమంలో బీఆర్ఎస్ నేతలు ఉత్తుత్తి రాజీనామాలు చేశారని, తెలంగాణ కోసం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారని చెప్పుకొచ్చారు. పోటీ చేసిన అభ్యర్థిని కలెక్టర్‌కు పరిచయం చేస్తే తప్పా అని ప్రశ్నించారు. హుజూరాబాద్ పిచ్చోడు అసెంబ్లీలో అరుస్తాడు. అసెంబ్లీలో హుజూరాబాద్ ఎమ్మెల్యే చప్పట్లు కొట్టి డ్యాన్సులు చేస్తాడు. కౌశిక్ రెడ్డి చిన్నపిల్లల కంటే దారుణంగా మాట్లాడుతున్నాడు.అంటూ దుయ్యబట్టారు.

రేవంత్ రెడ్డిని అరెస్టు చేసినట్టు తాము అరెస్టు చేయాలనుకుంటే బీఆర్ఎస్ నేతలంతా జైల్లో ఉండేవాళ్ళన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో బీఆర్ఎస్ నేతల హస్తం లేకపోతే ఆఫీసర్లను దేశం ఎందుకు దాటించారని ప్రశ్నించారు. చేసేది న్యాయమే అయితే సోషల్ మీడియాను వేరే దేశం నుంచి నడపాల్సిన అవసరం ఏంటని నిలదీవారు. అలాగే, యూ ట్యూబ్‌లో జరిగిన దానిపై మేం కొంత దూకుడుగా ఉండాల్సింది. మా వైఫల్యం కొంత ఉంది. అని తెలిపారు. తెలంగాణ తల్లిని దొరసాని లాగా చేశాని తెలంగాణ తల్లిని కవిత లాగా తయారు చేశారన్నారు. బంగారు ఆభరణాలు, వడ్డాణాలు పెట్టి తెలంగాణ తల్లిని తయారు చేశారని అన్నారు. సబ్బండ వర్గాల ప్రతినిధిగా తెలంగాణ తల్లిని తయారు చేస్తామని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు.

# అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం Dr BR అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా హబ్సిగూడ X Road లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత, అణగారినవర్గాల హక్కులకోసం, సమాజం లోని అసమానతలను రూపుమాపడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని మహిళాహక్కులకోసం పదవిని త్యాగం చేశారు అంబేద్కర్.. ఆమహానుభావునికి నివాళులర్పిస్తోంది.

అంబేడ్కర్ చేసిన కృషిని సేవలను కొనియాడుతూ విద్య, రాజకీయ అంశాలు అభివృద్ధికి రెండు చిహ్నాలు అని గుర్తించిన మొదటి వ్యక్తి అంబేడ్కర్ అని అతని యొక్క ఆశయాలను సాధించడములో ముందుండి దేశ భవిష్యత్తు లో మమేకం అయినప్పుడే అంబేడ్కర్ కి నిజమైన నివాళి అవుతుంది అని ప్రతి భారతీయుని బాధ్యతలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, కంచర్ల సోమిరెడ్డి, లక్ష్మీనారాయణ, సుక్క కిరణ్, యాదగిరి, కైలాసపతి, మనోహర్, వీరేందర్, సంజయ్ జైన్, దినేష్ చెట్టుకూరి, నాని, మెహబూబి, నరేందర్ రాజు, చంద్రశేఖర్, కాలేరు నవీన్, యాకాంత్ తదితరులు పాల్గొన్నారు.





## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

■ కుండ భాను చందర్

**జయభేరి, మేడ్చల్ :**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ యువజన నాయకుడు కుండ భానుచందర్ అన్నారు. శుక్రవారం బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా 5వ వార్డు దళిత వాడాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాను చందర్ మాట్లాడుతూ దేశానికి వన్నె తెచ్చిన గొప్పవ్యక్తి బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం నివాళీలు అర్పించకుండా మరిచిపోవడం పై మండిపడ్డారు. మహనీయుల చరిత్రలు తరతరాల గుర్తు ఉండాలంటే వారి గొప్పతనాన్ని, వారు దేశానికి చేసిన సేవలు నేటి సమాజానికి తెలియాల్సి అవసరం ఉందన్నారు. వారి జయంతి, వర్ధంతి రోజుల్లో మహనీయులకు నివాళీలు అర్పించడం ద్వారా వారిని గౌరవించుకున్న వాళ్ళం అవుతామని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక, నర్సమ్మ, బాల మైసమ్మ, లక్ష్మి, లలిత, జ్యోతి, పోచమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



## వీరవెల్లి గొర్ల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడిగా దయ్యాల మహేష్ కురుమ

**జయభేరి, భువనగిరి, డిసెంబర్ 6 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వీరవెల్లి గొర్ల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడిగా దయ్యాల మహేష్ కురుమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దయ్యాల మహేష్ కురుమ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కురుమ కులస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని పథకాలను వచ్చే విధంగా చూస్తానని,వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బిఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టులు

■ బిఆర్ఎస్ రాష్ట నాయకులును అక్రమ అరెస్టు చేసిన సందర్భంగా ధర్నాలు




**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలో బిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం తెలుపుతున్న సందర్భంగా చందంపేట మండల పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్ కి తరలించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంట్లు 420 హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిన సందర్భంగా బి ఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రులు ఎమ్మెల్సీలు నాయకులు రేవంత్ ప్రభుత్వానికి ప్రశ్నించడంతో అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్ కి తరలించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల రైతులకు ఉద్యోగులకు విద్యార్థులకు మహిళలకు వితంతువులకు వికలాంగులకు వృద్ధులకు 6 గ్యారంటీలతో గారడి మాటలు చెప్పి ఓట్లు దండుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఈ పోరాటం ఆగదని గుర్తు చేశారు. పోలీస్ వ్యవస్థ మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన మాయ మాటలు నమ్మి బిఆర్ఎస్ నాయకులను ఎక్కడపడితే అక్కడ అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు అయినా మా బిఆర్ఎస్ కార్యకర్తలకు ఆ నాయకత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో అచ్చంపేట పట్టి మాజీ సర్పంచ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జరుపుల లోక్యా నాయక్, వివిధ బి ఆర్ ఎస్ నాయకులు.

## మద్యాహ్నం వరకు పత్తాలేని తాహశీల్దార్

**జయభేరి, యాదాద్రి:**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల తాహశీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం ఒంటి గంట అవుతున్నా ఎమ్మార్వో కృష్ణ విధులకు రావడంలేదు. కంప్యూటర్ ఆపరేటర్, తాహసిల్దార్ లేకపోవడం తో నిన్న 8 స్లాట్ లు బుక్ చేసుకున్న వారికి ఫోన్లో సమాచారం ఇచ్చి తాహశీల్దార్ కార్యాలయం వద్దకు రావద్దని సమాచారం ఇస్తున్నాడు.

# ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

**ఉప్పల్ :**

రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది నీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు నిలువుటద్దం. ఒకవైపు ప్రజా పాలన విజయోత్సవాలు అని ప్రచారం చేసుకుంటూ, మరోవైపు రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని ప్రకటించావు. మీ అప్రజాస్వామిక విధానాలు, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వైఖరిని చూసి హైదరాబాద్ నడిగడ్డ పై ఉన్న అంబేద్కర్ సైతం నివ్వెరపోతున్నడు. అదుపులోకి తీసుకున్న మా BRS పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.



# షెడ్యూల్డ్ కులాల సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమం

**జయభేరి, ఉప్పల్, డిసెంబర్ 6 :**

నవ భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్.బాబాసాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాన్ని షెడ్యూల్డ్ కులాల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ తన జీవితాన్ని దేశ ప్రజల కోసం త్యాగం చేశారని గుర్తు చేశారు. అహర్నిశలు కృషి చేసి మహోన్నతమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించి, సమసమాజ స్థాపనకు పాటుపడ్డారని ఆయన సేవలను కొనియాడారు. సమానత్వం కోసం రాజీలేని పోరాటం చేశారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని గట్టిగా నినదించిన వ్యక్తి. రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలు పరచడమే ఆయనకు ఘనమైన నివాళని తెలిపారు. ప్రపంచం గర్వించే మేధావి అంబేద్కర్ ను స్మరించుకోవడం ప్రతి భారతీయ పౌరుడి భాధ్యతని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోండ్ర రాములు, ప్రధాన కార్యదర్శి పల్నాటి డేవిడ్, తెరాస నాయకులు పిట్టెల నరేష్, జెల్లి మోహన్, ఈరెల్లి రవి, కొంపల్లి రవి. సంఘం ప్రతినిధులు రాంచెర్ల బలరాం, పొడిశెట్టి కృష్ణ, విబి నరసింహ, పార్నంది నర్సింగ్ రావు, డాక్టర్ అశోక్, పల్లె నర్సింగ్ రావు, నీరుడు అంజన్ కుమార్, మాస శేఖర్, పల్నాటి కిష్టయ్య, బొల్లం లక్ష్మణ్, మారపాక సాయిలు, రాంచందర్, కోండ్ర లింగుస్వామి, బైలిక మహేందర్, సుక్క హరిబాబు, జ్ఞానేశ్వర్ తదితర వివిధ పార్టీల, సంఘాల నాయకులు హాజరయ్యారు.



# అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

■ పిర్జాదిగూడ నగరపాలక సంస్థ మేయర్ అమర్ సింగ్

స్వతంత్ర సమరయోధుడు, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పిర్జాదిగూడ నగరపాలక సంస్థ మేయర్ అమర్ సింగ్ ఆ మహానేతకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత,అణగారిన వర్గాల హక్కులకోసం, సమాజంలోని అసమానతలను రూపుమాపడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని మహిళా హక్కుల కోసం పదవిని త్యాగం చేశారు. అంబేద్కర్ చేసిన కృషిని సేవలను కొనియాడుతూ విద్య,రాజకీయ అంశాలు అభివృద్ధికి రెండు చిహ్నాలు అని గుర్తించిన మొదటి వ్యక్తి అంబేద్కర్ అని ఆ మహానుభావుని యొక్క ఆశయాలను సాధించడములో ముందుండి దేశ భవిష్యత్తులో మమేకం అయినప్పుడే అంబేద్కర్ కి నిజమైన నివాళి అవుతుంది అని ప్రతి భారతీయుని బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాదుగుల చంద్రారెడ్డి, పప్పుల అంజిరెడ్డి, పాశం బుచ్చి యాదవ్, పంగా ప్రణయ్ కుమార్,మణిరామ్ నాయక్, CH.నరసింహారెడ్డి, సుక్క జయేందర్, బొటుమంచి సునీల్, కాటపాక కుమార్, తవిటి ప్రశాంత్ పాల్గొన్నారు.








## అంబేడ్కర్ అందరివాడు

■ కౌన్సిలర్ రాజకుమారి సుధాకర్

■ బసురేగడిలో ఘనంగా బీఆర్ అంబేద్కర్ వర్ధంతి



**జయభేరి, మేడ్చల్ :**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరివాడని గుండ్లపోచంపల్లి 7వ వార్డు కౌన్సిలర్ మారేపల్లి రాజకుమారి సుధాకర్ అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బసురేగడిలో కౌన్సిలర్ మారేపల్లి రాజకుమారి సుధాకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరివాడని, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారేపల్లి సుధాకర్, బాసురేగడి గ్రామ పెద్దలు జీడీ బిక్షపతి, లడ్డునూరి భాస్కర్, జీడీ ఆశీర్వదం, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కునూర్, దాట్ల అశోక్, ఉప్పుగాల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## గుండ్లపోచంపల్లిలో బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



**జయభేరి, మేడ్చల్ :**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని గుండ్లపోచంపల్లి 14వ వార్డు కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా ట్యాంక్‌బండ్‌పై ధర్నాకు బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుమేరకు పెట్ భాషిరాబాద్ పోలీసులు గుండ్లపోచంపల్లిలో బిఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ ఉచిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ సంవత్సరం గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి సంబర పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యమలతో స్వరాష్ట్రం సాధించిన బిఆర్ఎస్ కు అరెస్టు లు కొత్త కాదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, భేరి బాలరాజు, మున్సిపల్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, నాయకులు జిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డా.బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి



**జయభేరి, మేడ్చల్ :**

భారత రాజ్యాంగ నిర్మాతగా భారత దేశ ఉన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత కీర్తి శిఖరం భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కండ్లకోయలోని ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాదయ్య ఎర్రోళ శ్రీనివాస్ ఎర్రోళ నర్సింగ్ సమక్షంలో అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కందాడి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని అట్టడుగు, పేద వర్గాల ప్రజల కోసం డాక్టర్ బిఆర్ అంబెద్కర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. నేటితరం యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలు గా కండ్లకోయ మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్, నాయకులు కర్రోళ స్వామి, హరిబాబు రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజేందర్, సాయిలు, రాజు, దేవేందర్, సిద్ధు, యాదయ్య, చందర్, టిల్లు, ఆత్మ సహకార సంఘము అధ్యక్షులు శ్రీకాంత్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

✍ జయభేరి, మేడ్చల్ :

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో స్వేచ్ఛను హరిస్తున్నదని మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నేతల అరెస్టులకు నిరసనగా ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ పోలీసులు బిఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలన పేరు చెప్పి ప్రజలను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక సంవత్సరం పాలన జరిగిన కూడా ఇప్పటివరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులను కార్యకర్తలను ప్రభుత్వం వెంబడించి హౌస్ అరెస్టులు చేస్తుందన్నారు. బిఆర్ఎస్ పార్టీకి అరెస్టులు కొత్త కాదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ఉండి పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణుచారి, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 30 సంవత్సరాల సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరించాము


- శాంతి సాయిజెన్ శేఖర్ కార్పొరేటర్ నాచారం



✍ జయభేరి, ఘట్కేసర్ :


నాచారం ఓల్డ్ విలేజ్లో 54 లక్షల రూపాయలు వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు శ్రీ బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ తో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. నాచారం ఓల్డ్ విలేజ్ కు ఎందరో ప్రజాప్రతినిధులు వచ్చారు కానీ భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేయించలేక పోయారు అలాంటిది కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేకర్ ప్రత్యేక చొరవ తీసుకొని సుమారు కోటి రూపాయలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేయించినందుకు అలాగే మంచినీటి సమస్యలు లో ప్రెజర్ సమస్యలు అన్నింటిని పరిష్కరించి ఈరోజు 54 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు కూడా వేయిస్తున్నందుకు ఎమ్మెల్యేకి, కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. బాలకృష్ణ AE కీర్తి వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, స్థానిక బారాసా నాయకులు కార్యకర్తలు, నాచారం ఓల్డ్ విలేజ్ ప్రజలు మరియు సీనియర్ సిటిజన్స్ పాల్గొనడం జరిగింది.

## మున్నూరుకాపు మహిళా స్టేట్ సొసైటీ డైరెక్టర్ గా మట్టి మంజుల బాలరాజు పటేల్



✍ జయభేరి, మేడిపల్లి :

మేడ్చల్ మల్కాజిగిరి నియోజకవర్గం మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ డైరెక్టర్ గా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన మట్టి మంజుల బాలరాజ్ పటేల్ ఎన్నికయ్యారు. గురువారం సిద్దిపేట జిల్లా ములుగు గ్రామంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి పుటం పురుషోత్తం రావు పటేల్ అధ్యక్షతన మున్నూరు కాపు మహిళా పరస్పర వినియోగ దారుల ఎన్నికలు నిర్వహించారు. ఈ మేరకు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మట్టి మంజుల బాలరాజు పటేల్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో డైరెక్టర్ గా నియమించినందుకు మున్నూరు కాపు పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



✍ జయభేరి, మేడిపల్లి :

రాచకొండ పోలీస్ కమిషనరేట్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని "తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ & కాలేజీ"లో మేడిపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా హాజరైన మేడిపల్లి SHO శ్రీ గోవిందా రెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ.. మంచి క్రమశిక్షణ పాటించాలని, భావి భారత భవిష్యత్తు విద్యార్థుల చేతిలోనే ఉందని, సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని, ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకుని మంచిగా కష్టపడి చదవాలని, ఉపాధ్యాయులను గౌరవించాలని, వారు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలని, తప్పు చేస్తే దండన తప్పదని, ఎట్టి పరిస్థితులలో నేరాలలో(క్రైమ్ లో) ఇన్వాల్వ్ కాకూడదని, చెడు పనులు చేయకూడదని విద్యార్థులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఇన్స్పెక్టర్ మేడిపల్లి శ్రీ R. గోవిందరెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్,మత్తు పానీయాలు జోలికి వెళ్లకూడదని, మంచిగా చదువుకోవాలని పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు అందరికీ మంచి పేరు తేవాలని, సమాజంలో మంచి ఉన్నత స్థానంలో పేరు పొందాలని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం సహ పంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యను, భోజన సదుపాయాలను, వసతులు, పరిసరాలను, మెనూను పరిశీలించి ప్రిన్సిపాల్ ను, ఉపాధ్యాయులని అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి. నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాదాపు 350 మంది పాల్గొన్నారు.

# విద్యార్థి ఆత్మహత్యలపై నోరుమెదుపని రాష్ట్ర ప్రభుత్వం

- విద్యార్థి ఆత్మహత్యలకు నిలయాలుగా మారిన కార్పోరేట్ విద్యాసంస్థలు
- ప్రభుత్వం విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులయిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాం
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



✍ జయభేరి, మేడిపల్లి :

ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘట్కేసర్ అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం కార్పోరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను చదువులు, ఫీజుల పేరిట తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నారాయణ, శ్రీ చైతన్య లాంటి కార్పోరేట్ యాజమాన్యాలు విద్యార్థులను కేవలం మార్కులు, ర్యాంకుల కోసమే తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. విద్యార్థులు తమ బాధను తల్లిదండ్రులకు చెప్పుకోలేక, ఉదయం నుండి రాత్రి వరకు చదువు పేరిట యాజమాన్యాలు పెడుతున్న మానసిక వేదనను తట్టుకోలేక నరకయాతన పడుతున్నారు.

సరియైన తరగతి గదులు లేకపోవడం, ఎటువంటి గాలి కానీ వెలుతురు రాని ప్రదేశాల్లో భోదన చేయడం, మానసిక ఉల్లాసం కోసం ఎటువంటి సమయం ఇవ్వకపోవడం, తినడానికి కూడా తగిన సమయం ఇవ్వకపోవడంతో మనోవేదనకు గురై విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, వరుసగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యాశాఖ అధికారులు కనీసం స్పందించకపోవడం చాలా బాధాకరం. ప్రభుత్వం కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. పాలకులు మారిన కూడా కార్పోరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల గుప్పిట్లో ప్రభుత్వ పెద్దలు బందీ అయ్యారు,

ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఆత్మహత్యలకు కారకులైన విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, జిల్లా నాయకులు అజయ్, వెంకట్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిది

✍ జయభేరి, ఘట్కేసర్ :



అంబేద్కర్ యువజన సంఘం మరియు ప్రబుద్ధ్ భారత్ అంతర్జాతీయ అద్వర్యంలో డా.బాబా సాహెబ్ అంబేద్కర్ 68వర్ధంతి నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి చైర్ పర్సన్ ఘట్కేసర్ మున్సిపాలిటీ ముల్లి పావని జంగయ్య యాదవ్ పులమాల వేసి నివాళులు అర్పించరు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. దళితుల పట్ల నాడు ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిది. అంటరానితనం గురించి ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. చిన్ననాటి నుంచే తాను ఎదుర్కొన్న అంటరానితనాన్ని ఎవరూ ఎదుర్కోకూడదని అణగారిన వర్గాలకు అండగా నిలబడ్డారు.

ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఇప్పటికీ చారిత్రాత్మకమైనవి. డాక్టర్ BR అంబేద్కర్ సేవలు గుర్తు చేస్తూ భీంరావ్ రాంజీ అంబేద్కర్ (డా. బాబాసాహెబ్ అంబేద్కర్ గా కూడా పిలవబడిన) ఒక ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త. ఇతను అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశాడు. స్వాతంత్ర్య భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పిఇతను కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి., లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి (డాక్టరేట్) పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించాడు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశాడు. మొదట్లో న్యాయవాదిగా, అధ్యాపకుడిగా, ఆర్థికవేత్తగా పని చేశాడు. తరువాత భారతదేశ స్వాతంత్ర్యం, పత్రికల ప్రచురణ, దళితుల సామాజిక రాజకీయ హక్కులు, భారతదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం కృషి చేశాడు. 1956లో ఇతను బౌద్ధ మతాన్ని స్వీకరించడంతో దళితులు సామూహికంగా బౌద్ధంలోకి మత మార్పిడి చేసుకున్నారని ఈ సందర్భంగా తెలిపారు.. అంబెడ్కర్ కుల మతాలకు అతీతంగా సేవలు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్.. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా భారతీయులకు పరిచయం చేయక్కర్లేని పేరు. అంతకంటే మిన్నగా రాజ్యాంగ నిర్మాతగా ఆయన పేరు చరిత్ర ఉన్నంతకాలం పదిలంగా ఉంటుంది. అంటరానితనంపై ఆయన పూరించిన సమరశంఖం నేటికీ ఆగ్రహజ్వాలలు పెల్లుబుకుతూనే ఉంది. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ సింగి రెడ్డి, మేకలా దాస్ (అధ్యక్షుడు, అంబెద్కర్ సంఘం నాయకులు) మీసాల మల్లేష్ (ఎమ్ఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు), కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాలు యాదవ్, వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, కౌన్సిలర్లు బందారు ఆంజనేయులు గౌడ్, కడుపోల్లా మల్లేష్, SK జహంగీర్, కుతాది రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుగురి మచెందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, సమన్వయ కమిటీ మాజీ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, JAC కమిటీ చైర్మన్ మారం లక్ష్మ రెడ్డి, DCC కార్యదర్శి ఆంజనేయులు, మాజీ బ్యాంకు చైర్మన్ సారా శ్రీనివాస్ గౌడ్, అంబెద్కర్ సంఘం అధ్యక్షుడు మేకల దాసు, మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు బర్ల దేవేందర్ ముదిరాజ్, మాజీ డైరెక్టర్ నరేష్‌గౌడ్, సత్యనారాయణ, రాందాస్, ఇరిటం శ్రీనివాస్, SS శ్రీనివాస్, గడ్డం శశ్రీనివాస్, ఇరితం జగదీష్, కుతాది సతీష్, రాజేష్, మీసాల అరుణ్, ఫాయుమ్, యువజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన విజయోత్సవాల కళా జాతర

✍ జయభేరి, దేవరకొండ :

తెలంగాణ సాంస్కృతిక సారథి నల్లగొండ జిల్లా కళాబృందం ప్రజాపాలన విజయోత్సవ సంబరాల యాత్రను విజయవంతంగా ముందుకు తీసుకు పోతుంది. ఈరోజు నల్గొండ జిల్లా లోని అప్పాజీపేట,అన్నెపర్తి మరియు చందనపల్లి మేజర్ గ్రామాలలో రేవంత్ రెడ్డి ఒక సంవత్సర ప్రజా పాలనలో సాధించిన అభివృద్ధి పొందినవిజయాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివిధ ప్రభుత్వపరమైన నిర్ణయాలు తదితర అంశాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించడం జరిగింది. ఈ ప్రదర్శనలను ప్రజలు ఎంతగానో ఆస్వాదించారు. కళాకారుల కళా ప్రదర్శనను మండల ఎంపీడీవో సంబంధిత గ్రామపంచాయతీల కార్యదర్శులు అభినందించారు. ఏ అంశమైన ప్రజల్లోకి బలంగా వెళ్లాలంటే కళా అనేది ముఖ్యమని పాట బలమైన ఆయుధమనిఅధికారులు కొనియాడారు. కళాకారులు బచ్చలకూరి శ్రీనివాస్,రేవూరి వీర ప్రతాప్, బందెల మల్లిక, కత్తుల శంకర్ నాగిళ్ల కొండల్,మోగుదాల సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి విగ్రహ పునర్ ప్రతిష్ట మహోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన పరమేశ్వర్ రెడ్డి


✍ జయభేరి, ఉప్పల్ :



రామంతాపూర్ శ్రీనివాస్ పురం లో దొరసానమ్మ దేవాలయం విగ్రహ పునర్ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం జరిగిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు నామ్ రాజి రెడ్డి, నామ్ బుచ్చి రెడ్డి, నామ్ సత్తి రెడ్డి, కాసర్ల శేఖర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వెంకటేష్ గుప్తా, బాల కృష్ణ రెడ్డి, సురేందర్ రెడ్డి, జలేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ యాదవ్, నాంచారి, సాయి, కాంగ్రెస్ నాయకులు రఫీక్, ఆకారపు అరుణ్, పటేల్, శ్రీకాంత్ యాదవ్, ఉపేందర్ రెడ్డి, అశోక్, నయీమ్, షాగా శ్రీధర్, కిషోర్, సచిన్, చింటూ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి

- ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలి
- నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



✍ జయభేరి, దేవరకొండ :

ప్రతి ఒక్కరు అంజనేయ స్వామీ అనుగ్రహం పొందాలి అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం కొండమల్లెపల్లి మండలం కేశ్య తండాలో ఆంజనేయ స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అద్యక్షులు రమావత్ దస్రు నాయక్,TVN రెడ్డి,బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు రమావత్ తులిసిరాం నాయక్ ,రమావత్ శ్రీను,రావుల వెంకటయ్య,తదితరులు పాల్గొన్నారు.

## అంభేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు

- కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ

✍ జయభేరి, మేడ్చల్ :



ప్రముఖ భారత స్వతంత్ర సమరయోధుడు, రాజ్యాంగ నిర్మాత, దళిత బడుగు బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత, భారత జాతి ముద్దుబిడ్డ, సామాజిక విప్లవ మహోపాధ్యాయుడు, మొదటి న్యాయ శాఖ మంత్రి, అనగారిన వర్గాల ఆశాజ్యోతి... భారత ప్రజాస్వామ్య సౌధానికి...రాజ్యాంగంతో ప్రాణం పోసిన మహనీయుడు... కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపి తలరాతలు మార్చిన జ్ఞాని దేశానికి దిక్సూచి స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వం తో జీవించాలని కలలుగన్న మహనీయుడు డాక్టర్ బాబ సాహెబ్ అంబేద్కర్... మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ పట్టణంలో గల భారత రత్న బహుజన ఆశజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి, మేడ్చల్ పట్టణ మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహ్మా రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్స్ పెంజర్ల స్వామి యాదవ్, కౌడే మహేష్‌కురుమ, మర్రి శ్రీనివాస్ రెడ్డి, రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్, మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సద్ది సుదర్శన్ రెడ్డి, కనకాల శివ కుమార్,బిపిటి రాజు, ఉదండపురం సత్యానారాయణ, రాజశేఖర్ రెడ్డి, రామన్నగారి సంతోష్ గౌడ్, పెదుగు శ్యాంరావ్, ఆటో ఎర్ర విజయ రావు, శ్రీనివాస్, ఆంజనేయులు మేడ్చల్ పట్టణ పుర ప్రముఖులు, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లవేషాలతో బీజీగా ఉన్న మండల ప్రజా పరిషత్ ఉన్నతాధికారులు

జయభేరి, పరవాడ:




గత ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయం వ్యవస్థ ప్రజలకు ప్రభుత్వంకి ఒక వారధిలాగా ఉండి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయ్యడంలో ప్రధాన పాత్ర పోసిస్తున్నాయి. సచివాలయలలో పనిచేసే సిబ్బందిలో 60% మంది మహిళలే ఉద్యోగులుగా పని చేస్తున్నారు. సచివాలయం వ్యవస్థ అంతా మండల ప్రజా పరిషిత్ క్రిందే ఉండడంతో పంచాయతీ సెక్రటరీలతో పాటు సచివాలయం సిబ్బంది కూడా ఎమ్ పి డి ఓ కార్యాలయంకే రిపోర్ట్ చేస్తున్నారు. అయ్యితే దీనినే అధికారులు వాళ్లకి అనుకూలంగా మలుచుకొని ఎక్కడ అవకాశం దొరుకితే అక్కడ సమయాలతో పని లేకుండా మహిళా సిబ్బందితో సమీక్షలు పేర్లు చెప్పి ఫోన్స్లో,వాట్సాప్లలో అసందర్భ వాక్యలు,చిట్ చాట్లు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పరవాడ మండలానికి బదిలీలో వచ్చిన ఓ ఉన్నతాధికారి సచివాలయల మహిళా సిబ్బందితో పిల్లా వేశాలు వేస్తున్న సాక్ష్యాలు బయటకి బహిర్గతం అవ్వడంతో వారి ప్రవర్తన పై మండలంలో అధికారులు మధ్య చర్చ మొదలయ్యింది.

పంచాయతీలలో సెక్రటరీలు ఉండగా వాళ్ళతో సంబంధం లేకుండా నేరుగా సచివాలయల మహిళా సిబ్బందితో చిట్ చాట్లు,మెసేజెస్ చేస్తుండడం అవి కొన్ని వ్యక్తిగతం వెళ్ళుతుండడంతో సచివాలయం సిబ్బందిలో కలకలం లేపింది.ఈ విషయం పై సోమవారం జిల్లా కలక్టర్ సమక్షంలో జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో,స్థానిక పోలీస్ స్టేషన్లో సంబందించిన బాధిత మహిళా ఉద్యోగులు, సచివాలయలలో మిగతా సిబ్బందితో వాటి పై ఫిర్యాదు చేసే సూచనలు కనిపిస్తుడడంతో ఆ అధికారులు అప్రమత్తం అయ్యి సద్దుమనుగు చేసే పనిలో ఉన్నారు.

ఒక వ్యవస్థ కి అధికారులు అయ్యి ఉండి క్రింద పని చేసే సిబ్బందితో ఏ విధంగా మలుచుకోవాలో తెలియని అధికారులు తమకు సార్లుగా ఉండడం చాలా హీనమేయినా పరిస్థితి అని మండలానికి ఓ మహిళా ఎంపీపీగా ఉండి వారు క్రింద ఉన్న శాఖ వ్యవస్థలో మహిళ ఉద్యోగులకు భద్రత లేకపోవడం సిగ్గుచేటుగా విమర్శకలు భావిస్తున్నారు.



# పేరెంట్స్ టీచర్ మీటింగ్ కార్యక్రమంకి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే పంచకర్ల

జయభేరి, పరవాడ:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించబోతున్న పేరెంట్స్ టీచర్ మీటింగ్కి తానం గ్రామంలో రెసిడెన్సిల్ స్కూల్ నందు జరగబోయే కార్యక్రమంకి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్య అతిధిగా పాల్గొంటున్నారు అని ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న కూటమి నాయుకులు పాల్గొనాలని ఎమ్మెల్యే కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

# తెలంగాణ సంస్కృతిపై కాంగ్రెస్ మరో దాడి షేక్ ఇస్మాయిల్



జయభేరి, దేవరకొండ :

ప్రపంచంలో పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ ప్రతి ఒక్కరికి తెలుసు ప్రకృతిని మనసా వాచా కర్మన పూజించే తెలంగాణ పండుగ బతుకమ్మ అలాంటి బతుకమ్మను తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ఎలా తీస్తారు తెలంగాణ ఉద్యమంలో ఆడ బిడ్డలను ఏకం చేసిన బతుకమ్మను తెలంగాణ తల్లి విగ్రహామ్ నుంచి తీసివేయడం చాలా బాధాకరంగా ఉందని దేవరకొండ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు గుమ్మడవల్లి షేక్ ఇస్మాయిల్ విమర్శించారు. తెలంగాణను నియంతల పాలిస్తున్న రేవంత్ రెడ్డి కూతురు భార్యను పోలి ఉన్నాయని దుయ్యబట్టారు ఉద్యమంలో ఏనాడు లేని రేవంత్ రెడ్డి ఆత్మగౌరవం కోసం పోరాడిన తెలంగాణ గడ్డను అవహేళన చేసేలా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. దైవత్వం ఉట్టిపడే తెలంగాణ తల్లి విగ్రహాన్ని చేతి గుర్తుతో కాంగ్రెస్ పార్టీని ప్రమోట్ చేసేలా డిజైన్ చేయడం తెలంగాణ రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం ,చార్మినార్ ను తొలగించే కుట్ర. అమరవీరుల స్తూపం రంగు మార్చే ప్రయత్నం చేయడం. తెలంగాణ గీతంగా ప్రజలు గుండె కద్దుకున్న జయ జయహే తెలంగాణ గీతాన్ని మార్చడం లాంటి చర్యలు రేవంత్ రెడ్డి నియంత పాలనకు నిదర్శనం అని అన్నారు. రేవంత్ రెడ్డి గద్దెనెక్కిన తర్వాత అవసరం లేని మార్పులు తప్ప సాధించింది ఏమీ లేదని ఆరు గ్యారంటీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేయడం మానుకోవాలని తెలంగాణ గడ్డమీద రేవంత్ రెడ్డి కుట్రలు సాగావని హెచ్చరించారు.

# ప్రభుత్వ పథకాలు పేదలకు వరం లాంటివి

- బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందచేత

జయభేరి, డిసెంబర్ 6:



ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు అందరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజక వర్గంలోనీ పలు మండలాలకు చెందిన వారికి సీఎం సహాయనిధి నుండి మంజురైన చెక్కులను అందచేశారు. ఈ సందర్బంగా కీసర కు చెందిన రమణమ్మ శిల్ప కు 60000, ముదుచింతలపల్లి మండలం కొల్తూరు గ్రామానికి చెందిన ప్రసాద్ కు 35000, నర్సారెడ్డికి 60000, శామీర్ పేట మండలం అలియాబాద్ కు చెందిన సీతారాంరెడ్డికి 60000, మూడుచింతలపల్లికి చెందిన ఆగమ్మకు 60000 రూపాయలు మంజూరు కాగా ఈ చెక్కులను వజ్రేశ్ యాదవ్ బాధితులకు అందచేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఒక వరం లాంటిదని, ఆయన అన్నారు. ప్రతీ ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, నాగారం మున్సిపాలిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, ఎంపిపి ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సికిందర్ రెడ్డి, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్ను విజయవంతం చెయ్యండి

జయభేరి, పరవాడ:



రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 7వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయబోయే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ను పండగ వాతావరణం లో ఎటువంటి అవాంతరాలు లేకుండా చక్కగా విజయవంతం చేయాలి అని పరవాడ మండల విద్యాశాఖ అధికారులు ఎం దివాకరరావు మరియు జి సాయి శైలజ మండలంలో గల 66 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం గురించి వివరిస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే ఈ మెగా పేరెంటు టీచర్ సమావేశము ఎటువంటి అవాంతరాలు లేకుండా షెడ్యూలు ప్రకారమే నిర్వహించాలి అన్నారు.

ఇప్పటికే ఈ కార్యక్రమానికి సంబంధించి విద్యార్థుల తల్లి దండ్రులకు ఆహ్వానపత్రాలు పంపించడం జరిగింది అన్నారు. ఈ ఆహ్వాన పత్రాలను విద్యార్థుల చేతనే తయారు చేసి పంపడం జరిగింది అన్నారు.

ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటలు, పోటీలు కూడా నిర్వహించి వారికి బహుమతులు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. అదేవిధంగా విద్యార్థుల అభివృద్ధి, లోటుపాట్లను గురించి తరగతి ఉపాధ్యాయులతో స్వయంగా తల్లిదండ్రులు మాట్లాడి తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల పట్ల గౌరవభావంతో మెలగాలి అని సూచించారు.

# డా. బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

జయభేరి, పరవాడ:



ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పెందుర్తి మండలం రాంపురం అదీప్ రాజ్ క్యాంప్ కార్యాలయం నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నారు అంటే మరియు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ లందరూ వాళ్లకు రావాల్సిన హక్కులు పొందుతున్నారు అంటే అది అంబేద్కర్ పుణ్యమేనన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పెందుర్తి జడ్పిటిసి ఉప్పులి దేవి కనకరాజు, సబ్బవరం ఎంపీపీ బోకం సూర్య కుమారి రామనాయుడు, మేంటి మహేష్, దాసరి సత్తిబాబు, పెందుర్తి మండలం వైస్ ఎంపీపీ చిరికి దేవుడు, అనకాపల్లి సోషల్ మీడియా కన్వీనర్ చందు యాదవ్, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మల్లు నాయుడుపాలెం సర్పంచ్ బోన్ నాయుడు, రొంగల శంకర్, 96వ వార్డ్ మహిళా అధ్యక్షురాలు వేణు, ఐడి దేముడు, సబ్బవరం ఎక్స్ సర్పంచ్ ధనవ రెడ్డి శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.



# శ్రీ ఆధ్య హాస్పటల్ నందు 8వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం

జయభేరి, పరవాడ :

అనకాపల్లి జిల్లా పరవాడ ఎకోనా హోటల్ ఎదురుగా ఉన్న ఉమామహేశ్వరి ఆశీస్సులతో శ్రీ ఆద్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 8వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయుచున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వైద్యుల సూచనల మేరకు ఉచితంగా ఈసీజీలు, ఎక్స్ రేలు, స్కానింగ్, షుగరు, కంటి పరీక్షలు చేయబడును అని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని శ్రీ ఆద్య మల్టీస్పెషల్టి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఎముకలు, కిళ్ల వైద్య నిపుణులు బండారు బాలకృష్ణ ఒక ప్రకటన ద్వారా తెలియపరిచారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్కు ఘనంగా నివాళులర్పించిన ఎన్టీపీసీ సింహాద్రి ఐఎన్టియుసి మజ్దూర్ యూనియన్



జయభేరి, పరవాడ:

ప్రపంచ మేధావి,భారత రాజ్యాంగ నిర్మాత, ఆర్థికవేత్త,న్యాయ కోవిదుడు, కుల వివక్షత అంటరానితనంపై అలుపెరగని పోరాటయోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యుదయ అక్షర కిరణం భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఐఎన్టీయూసీ యూనియన్ ఆఫీస్ వద్ద సింహాద్రి ఐఎన్టియుసి మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ బి భీమరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజెపి లెనిన్, కార్యవర్గ సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ బి.భీమరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజెపి లెనిన్, కార్యవర్గ సభ్యులు పాల్గొని 10 నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళులర్పించడం జరిగింది.

# మానవత్వం చాటుకున్న ఎన్టిపిసి సింహాద్రి ఉద్యోగిని రుగడ లక్ష్మి



జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు కడపాలెం గ్రామంలో మైలపల్లి నూకాలమ్మ గత నవంబర్ నెలలో వారు నివాసం ఉంటున్న కమ్మల ఇల్లు కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎన్టిపిసి సింహాద్రిలో అర్ఎల్ఐ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న రుగడ లక్ష్మీ వారి సొంత నిధులతో ఇంటికి కావలసిన నిత్యవసర సామాన్లు, ఒక రైస్ బ్యాగ్, మూడు వేల రూపాయలు నగదు అందజేసి తనలో ఉన్న మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు మైలపల్లి లక్ష్మణ, గనగల్లరాజు ఉన్నారు.

# అంగన్వాడి కుర్చీలు.. పలకలు బహుకరణ



జయభేరి, దేవరకొండ :

అంగన్వాడి సెంటర్లు చిన్నారులకు ఎంతో ఉపయోగకరంతో పాటు ప్రీస్కూల్ విద్య అందుతుందని దేవరకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు సిరందాసు కృష్ణయ్య జన్మదిన పురస్కరించుకుని 30 కుర్చీలు పలకలు అందించారు . ఈ సందర్భంగా దాత శిరందాసు కృష్ణయ్య మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లో చిన్నారులకు సౌకర్యార్థం కుర్చీలు అందజేశానని భవిష్యత్తులో సైతం ఊరి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన పుట్టినరోజుని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కార్యదర్శి సభ్యులు కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్ లయన్ ,ఎం జె ఎఫ్ గాజుల రాజేష్, చీదెళ్ల వెంకటేశ్వర్లు, వనం శ్రీనివాస్, ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్, ఎస్. రాము చౌహాన్, కుంచకూరి లక్ష్మణ్ , దినేష్, లకుమారపు మల్లయ్య , సూపర్వైజర్ ఎన్ రాధా సి .పద్మ,అంగన్వాడి 1, టీచర్స్ దువ్వ రాజమణి, 2 , పూనమాణి , మాజీ సర్పంచ్ ప్రభాకర్ రావు ,వెంకటేష్ గౌడ్ ,అలపాటి లక్ష్మయ్య ,పావురాల కొండలు జల్లా నరసింహ,ఆకుల కాశయ్య ,అంకురి ఇద్దయ్య, నూనె సురేష్ ,కుకుడాల పాండు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక స్థాయిలో తరగతి గది నుండే విద్యార్థులకు భవిష్యత్

జయభేరి, నేరేడుగొమ్ము :

ప్రాథమిక స్థాయి నుండి పాఠశాలలలో విద్యార్థులకు కొత్త ఆలోచనను రేఖీ తించడం కోసం ఫోర్ సైట్ ఫౌండేషన్ పనిచేస్తుందని ఫోర్ సైట్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎన్. ఉదయ్ ఎం. శివకుమార్ కే. శివరాజులు అన్నారు. మొట్ట మొదటిసారిగా తమ ఫౌండేషన్ ద్వారా నల్లగొండ జిల్లా నేరేడుగోమ్ము ప్రాథమిక పాఠశాల ని ఎంచుకొని పాఠశాలలో గదులకు పాఠశాల నూతన హంగులను రంగులను ఏర్పాటు చేసి పాఠశాలలో బెంచీలను బ్యాగులను స్పోర్ట్స్ కిడ్స్ ను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావే శంలో వారు మాట్లాడుతూ తమ సంస్థ కేవలం భౌతికమైనటువంటి అభివృద్ధి కోసం కాదని కొత్త ఆలోచనలు ప్రాథమిక పాఠశాలలో 10 సంవత్సరాలలో విద్యార్థులలో రేకెత్తించేటి నూతన ఆలోచనలకు పదును పెట్టడం కోసం పనిచే స్తుందని తెలిపారు. కేవలం ప్రాథమిక విద్యను తల్లిదండ్రులు సైతం పట్టించు కోవడం లేదని ప్రాథమిక స్థాయి విద్య నిర్లక్ష్యానికి గురవుతుందని అది గుర్తించి తమ సంస్థ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. తమకు సహకరించిన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు ఎన్.ఉదయ్ ,ఎం .శివకుమార్, కే.శివరాజ్ లను అభినందిస్తూ శాలువాతో పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేరడుగొమ్ము ఎం ఈ ఓ రఘు, మండల తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్ శ్రీధర్, ఎస్సై సతీష్, కొండమల్లేపల్లి ఎం ఈ ఓ నాగేశ్వరరావు ,చందంపేట ఎం ఈ ఓ చందర్ నాయక్, ఉపాధ్యాయులు విజయ్ ,పోలేపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం సామ్యానాయక్ , నేరేడుగోమ్ము కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్. ఈ కార్యక్రమం లో పాఠశాల హెచ్ఎం హైజాక్ ,ఉపాధ్యాయులు జగత్, నసీరుద్దీన్, దర్శనం సైదులు (వ్యాపారవేత) అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్ పరేగన్, మాజీ సర్పంచ్ రమేష్,సీఆర్పీలు, గ్రామ పెద్దలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## మహనీయులను స్మరించుకోవాలి

- మాజీ ఎఫ్డీసీ చైర్మన్ వంటెరు ప్రతాప్ రెడ్డి



జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 06 :

గజ్వేల్ పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి , ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం సి రాజమౌళి, గజ్వేల్ మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య దళిత సంఘాల నాయకులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

## కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- హరీష్ రావుకు కేసులు కొత్తేం కాదు
- ఎన్ని కేసులు పెట్టినా భయపడే నాయకుడు హరిష్ రావు కాదు




జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 06 :

మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పై కక్షపూరితంగా కుట్రపూరితంగా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ కేసులు పెట్టడం తీవ్రంగా ఖండిస్తున్నామని మర్కుక్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య మాజీ మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీరు ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని ఎఫ్ఐఆర్లో బుక్ చేపించిన మీరు చేస్తున్న మోసాలను ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రజలకు ఇచ్చిన ఆరు అమలు కాని గ్యారెంటీలపై అడుగడుగున ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి మెడలూవంచేదాకా పోరాడుతామని వారు తెలిపారు.కానీ నేడు అధికార దుర్వినియోగానికి పాల్ప డుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాల పాడుతూ పాత కేసులను లేవనెత్తుతున్నారని రేవంత్ రెడ్డి పై ఫైర్ అయ్యారు.గతంలో ఇలానే అవాకుల చవాకులు లేని మాటలు మోసపూరితమైన మాటలు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉంటే తెలంగాణ ప్రజలు ఎక్కడ తరిమికొడతారని తుపాకిని దగ్గర పెట్టుకొని తిరిగిన చరిత్ర రేవంత్ రెడ్డి అని అన్నారు.ప్రజల మధ్యల తిరిగిన చరిత్ర హరీష్ రావుది అన్నారు.ప్రజా క్షేత్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతున్నందుకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో తప్పుడు కేసు పెట్టడాన్ని వారు ఖండిచారు.ఇది రేవంత్ నిరంకుశ వైఖరునికి నిదర్శనమని అన్నారు. హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా ఉంటే నిద్ర పట్టక ఎక్కడ కాంగ్రెస్ కోట కదులుతుందో అని భయపడి హరీష్ రావు పై కేసులు పెట్టిస్తున్నారని అన్నారు.నీ అసమర్ధ పాలనతో ప్రజలు విసిగిపోయారని నువ్వు ముఖ్యమంత్రి కుర్చీకి సరిపోవని చిల్లర రాజకీయాలు చేస్తూ ముఖ్యమంత్రి అనే పదానికి మచ్చ తీసుకునే విధంగా చర్యలు ఉన్నాయన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు

- సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు
- రాష్ట్ర టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంతారావు

జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 06 :




సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని టిపిసిసి అధికార ప్రతిని ధి బండారు శ్రీకాంతారావు తెలిపారు. అనంతరం యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన వారిని శు క్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా అనిల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు, అలాగే గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ఉపా ధ్యక్షులు ఆధ్వర్యంలో గెలిచినందుకు సంతోషంగా ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఒడిదుడుకులకు ఎదురైనా కష్టాలను ఎదుర్కొని యువజన కాంగ్రెస్ విభాగం ఎన్నికల్లో గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వివిధ మండలాల ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కరుణాకర్‌రెడ్డి, నందకుమార్, కిషోర్, సమీర్, సాయికుమార్, ఉమామహేశ్వర్, రాజు, సూరజ్, సల్మాన్, శ్రావణ్, దాసు, సింగం స్వామి, రవి, ప్రభుదాస్, కిరణ్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి, లీగల్ సెల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్రావు, గజ్వేల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భానుప్రకాష్ రావు, ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కొమ్ము విజయ్కుమార్, ప్రవీణ్, ఎండి. జానీ, ప్రవీణ్, క్యాసారం బాబా, మామిడి కృష్ణ, కిషోర్, రతన్, రాజు, భాను, జాలిగామ శ్రీనివాస్, రాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఏసిపి..?

- అయ్యా ఏసీపీ ఈ భారీ అక్రమ నిర్మాణంలో మీ వాటా ఎంత..?
- ఏసీపీకి మామూళ్లు అందితే కూల్చరు, అందకపోతే కూల్చుతారనే విమర్శలు

జయభేరి, సిటీ ప్రతినిధి, డిసెంబర్ 6:



ఆయన ప్రతాపం అంతా పేదవారి ఇల్ల మీదనే చూపిస్తాడు. బడా బాబుల బడా బడా అక్రమ నిర్మాణాల జోలికి మాత్రం వెళ్లడు. వివరాల్లోకి వెళితే ఏసిపి ప్రతాప్ అండదండలతో ఎల్బీనగర్ సర్కిల్ జాంగిర్ నగర్ కాలనీలో భారీ అక్రమ నిర్మాణం ఒక అనుమతి లేని సెల్లార్, అలాగే అనుమతి జి ప్లస్ టు ఉంటే నాలుగు ఐదు అం తస్తులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణదారుడు. ప్ర భుత్వం నుండి లక్షల్లో జీతాలు తీసుకుంటూ, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సింది పోయి అక్రమ నిర్మాణదారులకు ఏసిపి సహక రిస్తున్నారంటూ, ఏసీపీని ప్రసన్నం చేసుకుంటే చాలు అనుమతులే అవసరం లేదు అన్న చందంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తు న్న స్థానిక ప్రజలు. ఇలాంటి అక్రమ నిర్మాణాల వద్ద ఏసిపితో పాటు కిందిస్థాయి సిబ్బంది కూడా చాలా గట్టిగానే దండుకున్నారేమో అందుకే ఆ అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నా రనే అనుమానం కూడా వ్యక్తం అవుతుందంటు న్నారు స్థానికులు. టౌన్ ప్లానింగ్ అధికారుల కు మామూల్లు అందితే అక్రమ నిర్మాణాలను కూల్చరని, మామూళ్లు అందకపోతే వెంటనే కూల్చుతారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఏసీపీ వద్దకు ఫిర్యాదులు ఎన్ని ఇచ్చినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, ఇకనైనా ఏసీపీ ప్రతాప్ అక్రమ నిర్మాణాలకు సహకరించకుం డా ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా కాపాడాలని డిమాండ్ చేస్తున్న స్థానిక ప్రజలు.

# గూగుల్ వార్...



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 6:

ముఖ్యంగా భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు ఐటి శాఖ మంత్రిగా కేటీఆర్ పని చేశారు. పురపాలక, పరిశ్రమల శాఖలను ఆయన పర్యవేక్షించారు. నాడు తాను మంత్రిగా ఉన్నప్పుడు లక్షల కోట్లల్లో పెట్టు బడులు వచ్చాయని.. తెలంగాణ సుభిక్షంగా ఉందని.. వేలాది ఉద్యోగాలు లభించాయని.. రాష్ట్ర ప్రభుత్వానికి దండిగా ఆదాయం సమ కూరిందని పదేపదే కేటీఆర్ చెబుతున్నారు. సామాజిక మాధ్యమ వేదికల ద్వారా గణాంకా లను వివరిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ పాలసీ విషయంలో భారత రాష్ట్ర సమితిని ఎదుర్కొ నేందుకు కాంగ్రెస్ పార్టీ వద్ద ఆయుధం అనేది లేకుండా పోయింది. దీంతో ఐటీ విభాగంలో లో కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేకపోతుందనే విషయం ప్రజల్లోకి భారత రాష్ట్ర సమితి బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నది. అయితే దీనికి అడ్డుకట్ట వేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు సరికొత్త ప్లాన్ రూపొందించారు. ఇకపై భారత రాష్ట్ర సమితి నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ తనపై విమర్శలు చేయకుండా పకడ్బందీ అస్త్రాలను సిద్ధం చేసుకున్నారు. దీనికి గూగుల్ సహాయం కూడా తీసుకున్నారు.అమెరికా తర్వాత అతి పెద్ద క్యాంపస్ గూగుల్ సంస్థకు హైదరాబా ద్ లోనే ఉంది. దీనిద్వారా వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. రకరకాల ఆపరేషన్లు ఇక్కడి నుంచే చేపడుతోంది. అయితే ఇప్పుడు ఆ సంస్థ హైదరాబాదులో సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. గత ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు గూగుల్ కంపెనీ తో చర్చలు జరిపారు. ఆ చర్చలు విజయవంత మయ్యాయి. దీంతో హైదరాబాదులో సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి గూగుల్ సుముఖత వ్యక్తం చేసింది. ప్రస్తుతం గూగుల్ సంస్థకు టోక్యోలోనే అతిపెద్ద సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఉంది.. ఇప్పుడు ఆ నగరం తర్వాత ఆసియా పసిఫిక్ రీజియన్ లో హైదరాబాదులోనే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయనుంది. గూగుల్ సేఫ్టీ ఇంజ నీరింగ్ సెంటర్ దేశంలోనే అత్యంత అధునాత నమైన సెక్యూరిటీ, ఆన్ లైన్ ఉత్పత్తుల భద్రత విషయంలో కీలకంగా వ్యవహరిస్తుంది. అంతేకాదు సైబర్ సెక్యూరిటీ పరిశోధనలకు వేదికగా నిలుస్తుంది. దీని ద్వారా వేలాదిమం దికి ఉద్యోగాలు లభిస్తాయి. గూగుల్ సంస్థ ప్రపంచంలోనే మేటి నగరాలను కాదని హైద రాబాదును ఎంచుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇన్ని రోజులపాటు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఐటీ పాలసీ మీద అవగాహన లేదని విమర్శలు చేసిన కేటీఆర్.. ఇకపై సైలెంట్ గా ఉండాల్సిం దేనని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. గత పది ఏళ్లల్లో ఎన్ని పెట్టుబడులు తెలంగాణకు వచ్చాయో తెలియదు కానీ.. తెలంగాణ రాష్ట్రా నికి ముఖ్యంగా హైదరాబాద్ ప్రాంతానికి ఐటీ నేనే పరిచయం చేశాను అన్నట్టుగా కేటీఆర్ వ్యవహార శైలి ఉండేదని కాంగ్రెస్ నాయకులు గుర్తు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల వల్ల తెలంగాణకు అతిపెద్ద బహుళ జాతి సంస్థలు వస్తున్నాయని.. ఇప్పుడు భారత రాష్ట్రపతి నాయకులు ముఖం ఎక్కడ పెట్టుకుం టారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.



## సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా చెట్టిపల్లి అనిల్ రెడ్డి

- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ దే ఘన విజయం

జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 06 :

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వీర సైనికులు అయినటు వంటి యువజన కాంగ్రెస్ నాయకులను టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో ఈరోజు గెలుపొందినటువంటి యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్య దర్శి బోనారి రాజు లను ఈరోజు ఘనంగా సన్మానించడం జరిగింది అలాగే వీరి తోపాటు గజ్వేల్ నియోజకవర్గంలో అన్ని మండలాల ఉపాధ్యక్షులు మరియు గజ్వేల్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు ,మండల ప్రధాన కార్యదర్శులుగా ప్రధాన ,కార్యదర్శిలు గా గెలుపొం దినటువంటి కరుణాకర్ రెడ్డి,నందకుమార్ ,కిషోర్ ,సమీర్ సాయి కుమార్, సల్మాన్, ఉమామహేశ్వర్ రాజు సూరజ్ ,శ్రావణ్ దాసు సింగం స్వామి కొంచెం రవి ప్రభుదాస్ కిరణ్ వీరందరూ యువజన కాంగ్రెస్ఎన్నికల్లోగెలుపొందినవారందరికీఘనంగాసత్కరించడం జరిగింది పార్టీకి యువజన నాయకులు సీనియర్ నాయకులైన ఎన్నో ఒడిదుడుకులకు గురైన కష్టాలను ఎదుర్కొని వీరందరూ గెలిచారని కాంగ్రెస్ పార్టీ కంకణబద్ధులై రేపు రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రతి ఒక్క యువజన కాంగ్రెస్ సైనికుడు పనిచేయాలని బండారు శ్రీకాంత్ రావు గారు పిలుపునిచ్చారు ఇట్టి కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాయిని యాదిగిరి లీగల్ సేల్ నాయకులు గోపాలరావు గజ్వేల్ మాజీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షు లు సర్పంచ్ కప్పరి బాను ప్రకాష్‌రావు ఇన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు ప్రవీణ్ ఎండి జానీ ప్రవీణ్ సయ్యద్ బాబా మామిడి కృష్ణ కిషోర్ రతన్ రాజు భాను జాలిగామ శ్రీనివాస్ రాజు యాదగిరి శ్రీకాంత్ వీరందరూ పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వీర సైనికులు అయినటువంటి యువజన కాంగ్రెస్ నాయకులను టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు గారి ఆధ్వర్యంలో ఈరోజు గెలుపొందినటువంటి యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోనారి రాజు లను ఈరోజు ఘనంగా సన్మానించడం జరిగింది అలాగే వీరి తో పాటు గజ్వేల్ నియోజకవర్గంలో అన్ని మండలాల ఉపాధ్యక్షులు మరియు గజ్వేల్ నియోజకవర్గం గజ్వేల్ నియోజకవర్గం ఉపాధ్య క్షులు మండల ప్రధాన కార్యదర్శులుగా ప్రధాన కార్యదర్శిలు గా గెలుపొందినటువంటి కరుణాకర్ రెడ్డి నందకుమార్ కిషోర్ సమీర్ సాయికుమార్ ఉమామహేశ్వర్ రాజు సూరజ్ సల్మాన్ శ్రావణ్ దాసు సింగం స్వామి కొంచెం రవి ప్రభుదాస్ కిరణ్ వీరందరూ యువజన కాంగ్రెస్ఎన్నికల్లోగెలుపొందినవారందరికీఘనంగాసత్కరించడం జరిగింది పార్టీకి యువజన నాయకులు సీనియర్ నాయకులైన ఎన్నో ఒడిదుడుకులకు గురైన కష్టాలను ఎదుర్కొని వీరందరూ గెలిచారని కాంగ్రెస్ పార్టీ కంకణబద్ధులై రేపు రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రతి ఒక్క యువజన కాంగ్రెస్ సైనికుడు పనిచేయాలని బండారు శ్రీకాంత్ రావు గారు పిలుపునిచ్చారు ఇట్టి కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాయిని యాదిగిరి లీగల్ సేల్ నాయకులు గోపాలరావు గజ్వేల్ మాజీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్య క్షులు సర్పంచ్ కప్పరి బాను ప్రకాష్‌రావు ఇన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్య దర్శి ప్రశాంత్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు ప్రవీణ్ ఎండి జానీ ప్రవీణ్ సయ్యద్ బాబా మామిడి కృష్ణ కిషోర్ రతన్ రాజు భాను జాలిగామ శ్రీనివాస్ రాజు యాదగిరి శ్రీకాంత్ వీరందరూ పాల్గొన్నారు.




# ఇంకెప్పుడూ నటించొద్దన్నారు

'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో అభినందనలు అందుకుంటున్న అందాల రష్మిక.. తన తాజా ఇంటర్వ్యూ ద్వారా ఆనందాన్ని వ్యక్తంచేస్తూ.. పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. "శ్రీవల్లి' లాంటి పాత్ర చేసినందుకు నన్నందరూ మంచి నటి అని మెచ్చుకుంటున్నారు. కానీ నా స్కూల్ టైమ్‌లో ఓసారి స్టేజ్ షో చేశా. అది ఎవరికీ నచ్చలేదు. కొందరైతే.. 'ఇంకెప్పుడూ నటించకు' అని ఉచిత సలహా కూడా పారేశారు' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక. ఇంకా చెబుతూ 'పదిమందిలో ఉన్నప్పుడు అక్కడ నన్నెవరూ నవ్వుతూ పలకరించకపోతే.. ఆ ప్రదేశంలో నేనుండలేను. అది నా బలహీనత. అంతేకాదు, కొన్ని రూమర్ల వల్ల కూడా కన్నీరు పెట్టుకున్న సందర్భాలున్నాయి. నా రెమ్యునరేషన్ గురించి ఏవేవో రాశారు. నిజానికి డబ్బు గురించి అస్సలు పట్టించుకోను. తొలి సినిమాకు తీసుకున్న పారితోషికం కేవలం రెండున్నర లక్షలు.
నాకు క్యారెక్టర్ ముఖ్యం. అయితే.. డబ్బు తక్కువ ఇచ్చినా పర్లేదు కానీ.. ఫ్రీగా మాత్రం చేయకూడదనేది నా పాలసీ' అని చెప్పారు 'ఓ మంచి బయోపిక్‌లో నటించాలి. అలాగే.. 'బాహుబలి'లో దేవసేన లాంటి పాత్ర చేయాలి. ఈ రెండు కోరికలు ఎప్పుడు తీరతాయా అని ఎదురు చూస్తున్నా' అని తెలిపారు రష్మిక. ప్రస్తుతం రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్, కుబేర, సికిందర్, ఛావా, థామ చిత్రాల్లో నటిస్తూ ఆమె బిజీబిజీగా ఉన్నది.



# నటి ప్రైవేట్ వీడియో లీక్..

సోషల్ మీడియా వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో.. అంతకుమించి నష్టాలు ఉన్నాయని చెప్పవచ్చు. ముఖ్యంగా సెలబ్రిటీల ప్రైవసీకి భంగం కలుగుతోంది. వారు ప్రైవేట్‌గా ఏటైనా బయటికి వెళ్తే చాలు.. ఇట్టే క్షణాలలో వారి ఫోటోలు, వీడియోలు నెట్టింట్లో వైరల్ గా మారుతాయి. ఇక హీరోయిన్ల పరిస్థితి మరీ దారుణం.. వారి ఫోటోలను, వీడియోలను మార్ఫింగ్ చేస్తూ అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. దీంతో సినీ సెలబ్రేటీలు తమ ఫ్యాన్స్ కు టచ్ లో ఉండేలా తమ ఫోటోలను వీడియోలను షేర్ చేస్తూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ అయితే సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫోటోలను వీడియోలను షేర్ చేస్తూ తమ అభిమానులకు గ్లామర్ షోను ఫ్రీగా అందిస్తూ ఉంటారు. వారు తన సినిమాలలో కంటే..సోషల్ మీడియాలో నానా హంగామా చేస్తూ ఫ్యాన్స్ నోట్లో నానుతూ ఉంటారు. ఈ వీడియో కేవలం ఇండస్ట్రీలోనే కాకుండా మహిళల భద్రతను ప్రమాదంలో ఉందని హెచ్చరిక జారీ చేసింది. దీంతో ఆడు కేంద్ర ప్రభుత్వం సైబర్ క్రైమ్ సంబంధించిన అవేర్నెస్ ను కల్పించడం కోసం రష్మిక మందాన ను సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం కు అంబాసిడర్ గా ఎన్నిక చేశారు. తాజాగా టాలీవుడ్ నటి ప్రగ్యా నగ్రా సంబంధించిన ఓ వీడియో నెట్టింట్లో వైరల్ గా మారింది. మీ అమ్మడు తొలుత మోడలింగ్ రంగంలో అడుగు పెట్టింది. అక్కడ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఆ ఫేమ్ తోనే సినిమాలలో నటించే అవకాశాన్ని కొట్టేసింది.



# 'జాట్' టీజర్ రిలీజ్

బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ యాక్షన్‌ప్యాక్డ్ మూవీ 'జాట్' కోసం మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో ఫస్ట్ టైం కొలాబరేట్ అయ్యారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌తో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ సినిమాపై ఎక్సయిట్మెంట్ మరింతగా పెంచింది. టీజర్ రెండు పాత్రల మధ్య సాగే డైలాగ్ తో ప్రారంభమవుతుంది, వారిలో ఒకరు పోలీసు ఆఫీసర్. డైలాగ్ హీరో నటోరియస్ నేచర్, శత్రువులను భయపెట్టే విధ్వంస మార్గాన్ని తెలియజేస్తోంది. విలన్స్ చేతులు, కాళ్లను గొలుసులతో కట్టి ఉంచిన సన్నీ డియోల్ క్యారెక్టర్ ఇంటెన్స్ ఇంట్రడక్షన్ ని ప్రజెంట్ చేస్తోంది. టీజర్‌లోని చాలా మూమెంట్స్ సన్నీ డియోల్ ఫిజిక్ ప్రజెన్స్, ఇంటెన్స్ క్యారెక్టర్ గురించి తెలియజేస్తున్నాయి. మ్యాసీవ్ ఫ్యాన్ ని ఉపయోగించి ఫైట్ సీక్వెన్స్ అదిరిపోయింది. రణదీప్ హుడాను మెయిన్ విలన్ గా పరిచయం చేయడంతో టీజర్ థ్రిల్లింగ్ నోట్‌తో ముగిసింది.రాపిడ్‌ఫైర్ యాక్షన్, స్టన్నింగ్ విజువల్స్‌తో టీజర్ రోలర్‌కోస్టర్ రైడ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. ప్రతి సన్నివేశంతో ఆడియన్స్ ని సీట్ ఎడ్జ్ న ఉంచుతుంది. గ్లింప్స్ సూచించినట్లుగా, సన్నీ డియోల్, రణదీప్ హుడా మధ్య ఇంటెన్స్ పేస్ ఆఫ్ మెయిన్ హైలైట్‌లలో ఒకటి. దర్శకుడు గోపీచంద్ మలినేని మాస్‌అప్పీలింగ్ యాక్షన్‌ని తీయడంలో తన స్కిల్ అద్భుతంగా చూపించారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై నిర్మించిన ఈ సినిమా నిర్మాణ విలువలు అత్యద్భుతంగా వుంటాయి. S థమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ యాక్షన్ ని ఎలివేట్ చేసింది. రిషి పంజాబీ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని బ్రెత్ టేకింగ్ విజువల్ గా నిలిపింది. హార్డ్ హిట్టింగ్ డైలాగ్స్, ఎక్స్ ప్లోజివ్ యాక్షన్, పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో టీజర్ మాస్ ఫీస్ట్‌ను అందిస్తుంది.ఈ చిత్రంలోవినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్‌ను పర్యవేక్షించగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. పీటర్ హెయిన్, అన్ల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌లు వర్క్ చేస్తున్నారు.
ఏప్రిల్ 2025 వేసవిలో ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. తారాగణం: సన్నీ డియోల్, రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com